ప్రజాశక్తి

శనివారం 9 మార్చి 2024 5

శ్రీ సత్యసాయి

అనంత అభివృద్ధి ఎంత..!

- ఎన్నికల హామీగానే అండర్ డ్రైయినేజీ
- పరిష్కారం కాని డంపింగ్ యార్డు సమస్య
- చిన్న రోడ్లతో ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎంత జరిగింది... ప్రధానమైన సమస్యలకు పరిష్కారాలు లభించాయా.. అన్న చర్చ అంతటా నడుస్తోంది. ఎందుకంటే ఎన్నికల సమయం వచ్చిందంటే ఆయా పార్టీలు పోటీలు పడి హామీలిస్తుంటాయి. వాటి అమలు ఎంత వరకన్నది తెలియని పరిస్థితులుంటాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో చూసినప్పుడు ఇక్కడ ఏ మేరకు నగరాభివృద్ధి జరిగిందన్న చర్చ నడుస్తోంది. ప్రధానమైన సమస్యలకు పరిష్కారాలు ఎంత వరకొచ్చాయన్నది కూడా చూడాల్సి ఉంటుంది.

ఎన్నికల హామీలుగా అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ

మూడు లక్షల వరకు జనాభా కలిగిన అనంతపురం నగరంలో అండర్ డ్రైయినేజీ ఇప్పటికీ లేదు. ప్రతి ఎన్నిక సమయంలోనూ ప్రధాన పార్టీల నాయకులందరూ ప్రధానంగా దీనిపైనే హామీనిస్తుంటారు. ఓపెన్ డ్రైయినేజీతో దోమలు, మురుగు సమస్య ఉంటోంది... కాబట్టి అండర్ డ్రైయినేజీని తీసుకొస్తామని చెబుతుంటారు. అయితే ఇది ఇప్పటి వరకు ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. 2009, 2014, 2019 ఎన్నికల సమయంలో ఈ హామీని అభ్యర్థులు ఇచ్చారు. దీని ఆచరణ, అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రాథమిక దశ కూడా దాటిన దాఖలాలు లేవు.

ఇటీవల అనంతపురం డంపింగ్‌యార్డులో చెలరేగిన మంటలు (ఫైల్ ఫొటో)

డంపింగ్ యార్డు ప్రధాన సమస్య

అనంతపురం నగరంలో రోజుకు వంద టన్నులపైగా చెత్త వస్తోంది. దీన్ని నగర శివారుల్లోని మార్కెట్‌యార్డు వద్ద వేస్తుంటారు. ఎప్పుడో నగరం చిన్నగా ఉన్నప్పుడు పెట్టిన ఈ యార్డులోనే చెత్త వేస్తుండటంతో పేరుకుపోయి కొండలా తయారయింది. దీన్ని ప్రాసెసింగ్ చేసి తగ్గించే చర్యలు కొంత చేపట్టిన పూర్తి స్థాయిలో అమలు జరగలేదు. తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చుట్టూ జనావాలు కూడా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులున్నాయి. దీన్ని సుదూర ప్రాంతానికి తరలిస్తామని ఇచ్చిన హామీ అమలు జరగలేదు.

ప్రధాన రహదారుల విస్తరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

అనంతపురం నగరంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పాతూరులోని గాంధీ బజారు, తిలక్ రోడ్డులో రద్దీ ఎక్కువగా ఉంది. దీని విస్తరణ చేపట్టలేదు. కనీసం ప్రత్యామ్నాయ మార్గాలపైనా దృష్టి సారించిన దాఖలాల్లేవు. శాంతినర్సింగ్ హోమ్ ముందు నుంచి గుత్తి రోడ్డు కలిపే రహదారి మధ్యలోనే ఆగింది. దానికి పరిష్కారం చూపలేని స్థితిలో పాలకులున్నారు. ఇది పూర్తయితే పైన పేర్కొన్న రహదారుల్లో రద్దీని తగ్గించేందుకు వీలుంటుంది.

కొన్నింటికి పరిష్కారాలు

ఈ ఐదేళ్ల కాలంలో కొన్నింటికి పరిష్కారాలను అయితే చేపట్టగలిగారు. ప్రధానంగా అనంతపురం నడిబొడ్డున టవర్‌క్లాక్ వద్ద పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నాలుగు లైన్లతో పూర్తి చేయగలిగారు. ఈ రహదారి మొత్తాన్ని ముందనుకున్న విధంగా విస్తరించలేకపోయినా చాలా వరకు పనిని మాత్రం పూర్తి చేయగలిగారు. అదే విధంగా గుత్తిరోడ్డును నాలుగు లైన్ల రహదారిగా రూపొందించారు. వీటితోపాటు ప్రధాన రహదారులను కొంత వరకు మెరుగు చేపట్టగలిగారు. రాజీవ్‌కాలనిలోనూ ప్రధాన రహదారుల నిర్మాణం ఈ ఐదేళ్ల కాలంలో పూర్తి చేయగలిగారు.

వైసిపిది కోతల పాలన

ప్రజాశక్తి-కొత్తచెరువు, కదిరి టౌన్

'2019లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాగానే అప్పటి వరకు ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను కట్ చేసింది. దాదాపు వంద సంక్షేమ పథకాలను రద్దు చేసింది. పేదలకు అందే సాయాన్ని దూరం చేసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా కటింగ్ పాలనను సాగిస్తున్నారు.' అంటూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శంఖారావం యాత్రలో భాగంగా శుక్రవారం నాడు ఆయన శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. ముందుగా పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం కొత్తచెరువు, కదిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను రద్దు చేశారన్నారు. పెళ్లికానుకలు, పండుగ కానుకలు, స్కూల్ ఫీజురీయింబర్స్ మెంట్, డ్రిప్ ఇరిగేషన్ తదితర వాటిని జగన్మోహన్‌రెడ్డి కట్ చేశారన్నారు. ఇలా 100 సంక్షేమ పథకాలు కట్ చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో కరెంట్ ఛార్జీలు 9 సార్లు పెరిగాయన్నారు. ఇంటి పన్ను, చెత్తపన్నులను పెంచేశారన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు, గ్యాస్ ధరలను పెంచి సామాన్యులను బాదేశారని తెలిపారు. ఇక ఉమ్మడి అనంతపురం జిల్లాకు జీవనాడి అయిన హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు ముందుకు వెళ్లడం లేదన్నారు. హెచ్ఎల్సీ ఆధునీకరణ జరగలేదన్నారు. టీడీపీ హయాంలో జీడిపల్లి-పేరూరు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తే నేడు నిలిపివేశారని దుయ్యబట్టారు. అనంతపురం జిల్లాను అభివద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అన్నారు. 1.30వేల మంది రైతులకు 90శాతం సబ్సీడీతో డ్రిప్ ఇరిగేషన్ అందించామన్నారు. హార్టికల్చర్ హబ్‌గా అనంతను అభివద్ధి చేశామని తెలియజేశారు. అరటి రైతుల ఆదాయం రెట్టింపు చేశామన్నారు. కరవు వస్తే ఒకే ఏడాది రూ.2వేల కోట్ల ఇన్‌పుట్ సబ్సీడీ అందించి రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. రోడ్లు, బ్రిడ్జిలు, తాగు, సాగు నీటి ప్రాజెక్టులను టిడిపి హయాంలో చేపట్టామన్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుకాగానే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగికి ప్రతి నెలా రూ.3వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం రాగానే వంద రోజుల్లో టిడ్కో గృహాలను పేదలకు అందజేసి గృహ ప్రవేశాలు చేయిస్తామన్నారు. కదిరి లాంటి ప్రాంతంలో మహిళలు, యువత ఉపాధి కోసం గల్ఫ్‌లాంటి దేశాలకు వెళ్తున్నారని వీరి కోసం స్థానికంగానే పరిశ్రమలు ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చి ఉపాధి చూపుతామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెడతామన్నారు. అనంతలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి సస్యశ్యామలం చేస్తామని పునరుద్ఘాటించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు బాబు సూపర్-6, బిసి డిక్లరేషన్ తదితర హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలిచేలా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షుడు బికె.పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, పవన్‌కుమార్‌రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు టిసి.వరుణ్, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై విమర్శలు

లోకేష్ ప్రసంగంలో ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పుట్టపర్తి ఎమ్మెల్యేపై లోకేష్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఏకంగా బ్యాంకులకే టోపీ పెట్టారన్నారు. రూ.1974 కోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టారన్నారు. రేపోమాపో ఆయన జైలుకు వెళ్తాడన్నారు. పుట్టపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టపర్తిలో ఎమ్మెల్యేను కాదని ఎవరూ లేఅవుట్ వేయలేని పరిస్థితి ఉందన్నారు. ఇక కదిరి ఎమ్మెల్యే సైతం సోలార్ పార్కులో పని చేస్తున్న ఏజెన్సీల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశారన్నారు. కదిరి లక్ష్మినరసింహ స్వామి ఆలయం డబ్బులను కూడా కాజేశారని విమర్శించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలని సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి కోరారు. ఆయన శుక్రవారం అభ్యర్థి సుధాకర్‌తో కలిసి మండలంలోని గోవిందా పురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రఘువీరా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. అంతకుముందు అభ్యర్థి సుధాకర్ గోవిందపురం గ్రామంలో కావేలమ్మదేవికి ప్రత్యేక పూజలు చేయించారు.కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే సుధాకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంజునాథ్, బిఎన్ మూర్తి, ప్రభాకర్‌రెడ్డి, విశ్వనాథ్, విశ్రాంత విఆర్ఓ రామలింగయ్య గౌడ్, సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ అందజేస్తున్న సవితమ్మ

మహిళా అభ్యున్నతికి టిడిపి కృషి : సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

మహిళా అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ విశేష కృషి చేసిందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సవితమ్మ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. సవితమ్మ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తేనే మహిళలకు రక్షణ ఉంటుందన్నారు. మహిళా సాధికారతకు టిడిపి మొదటి నుంచి పెద్దపీట వేస్తోందని, ఎన్టీఆర్ రాజకీయాల్లో 9 శాతం రిజర్వేషన్ కల్పించగా చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికలు, ఉద్యోగాలు, కళాశాలల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. విరివిగా డ్వాక్రా రుణాలు అందించి వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి చేపట్టే కార్యక్రమా లను వివరించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక మహిళలపై 2 లక్షలకు పైగా నేరాలు జరిగాయన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేనపార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబును సిఎం చేసుకోవాలని మహిళలను కోరారు. అనంతరం 1000 మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పరిటాల రవి ఘాట్‌ను సందర్శించిన సవితమ్మ

రామగిరి మండలంలోని వెంకటాపురం గ్రామంలో మాజీ మంత్రి పరిటాల రవీంద్ర ఘాట్‌ను శుక్రవారం పెనుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ, నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ నరసిం హారావు సందర్శించి నివాళులర్పించారు. మాజీ మంత్రి పరిటాల సునీతను కలిసి అంతర్జాతీయ మహి ళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అంతకుముందు సవితమ్మ మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పెనుకొండ పట్టణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి, ఐముక్తేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేకమైన పూజలు చేశారు. ఆమెతో పాటు నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ నరసింహారావు, నాయకులు ఉన్నారు.

మహిళా సాధికారతే వైసిపి ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళా సాధికారతే ధ్యేయంగా పని చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పట్టణం లోని 4వ వార్డులో శుక్రవారం మంత్రి 'ఆత్మీయ పలకరింపు' కార్యక్రమం నిర్వహిం చారు. ముందుగా మంత్రికి పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా అభ్యున్నతే ధ్యేయంగా సిఎం జగన్ నిరంత రం కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా వైఎస్ఆర్ చేయూత, అమ్మఒడి, ఆసరా, కళ్యాణమస్తు, తదితర సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మహిళలంతా కలిసికట్టుగా పని చేసి వైసిపిని గెలిపించాలని కోరారు. అనంతరం వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి మంత్రి ప్రజలకు వివరించారు. మంత్రి వెంట నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఉమర్‌ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, జయశంకర్‌రెడ్డి, కౌన్సిలర్లు తయూబ్, సుధాకర్‌రెడ్డి, గణేష్, రఘునాథరెడ్డి, బోయ బాబు, సద్దాం, శ్రీరాములు, శేషాద్రి, రామంజి, యాసిన్, టౌన్ కన్వీనర్ నరసింహా, నాయకులు కొండల రాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

'శంఖారావం' సభతో వైసిపిలో వణుకు

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మడకశిరలో చేపట్టిన శంఖారావం సభ విజయవంతం కావడంతో వైసిపి శ్రేణుల్లో వణుకు మొదలైందని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ మాట్లాడుతూ శంఖారావం సభకు రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ, మడకశిర మండలాల నుంచి టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా పెద్దఎత్తున తరలి రావడంతో విజయవంతమైందన్నారు. ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో కూడా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమన్నారు. ఆయనతో పాటు విఎం పాండురంగప్ప, లెజెండ్ సుధాకర్, హనుమంతరాయప్ప, ఆదినారాయణ, అశ్వద్ధామప్ప, క్రిష్టప్ప, మంజునాథ్, నరేష్, రమేష్ ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

మడకశిర : నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి ఉపాధ్యాయ వత్తికి రాజీనామా చేసి వచ్చే ఎన్నికల్లో మడకశిర ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని హళ్లికెర జగన్నాథ్‌ప్రసాద్ తెలిపారు. మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయన శుక్రవారం నీలకంఠాపురం, సిద్ధగిరి, కొలింపాలెం, గంగల వాయి పాలెం, జక్కేపల్లి, గుడ్డంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట శ్రీనివాసులు, వేణుగోపాల్, విజయ్‌కుమార్, ఈరన్న, నరసింహమూర్తి ఉన్నారు. నిరుద్యోగ, తాగునీటి సమస్యల పరిష్కా రానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న జగన్నాథ ప్రసాద్

క్వారీలో పేలుడు

- రేకులషెడ్డుపై పడ్డ బండరాళ్లు
- మహిళ దుర్మరణం

పేలుళ్లుజరిపిన క్వారీ ప్రాంతం ఇదే...

ప్రజాశక్తి-లేపాక్షి

క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. ఎలాంటి ముందస్తు రక్షణ చర్యలు లేకుండా క్వారీలో పేలుళ్లను చేయడంతో బండరాళ్లు ఎగిసి పడ్డాయి. పెద్ద బండరాళ్లు రేకుల షెడ్డుపై పడి, అందులో ఉన్న మహిళపై పడడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. ఈ ఘటన క్వారీ యజమానులు చేస్తున్న అక్రమ పేలుళ్లకు అద్దంపడుతోంది. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... లేపాక్షి మండల పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ బయన్నపల్లి గ్రామం సమీపాన గ్రానైట్ క్వారీ ఉంది. క్వారీ సమీపంలో అందులో పని చేసే మామిడిమాకులపల్లి గ్రామానికి చెందిన ఈడిగ కిష్టమ్మ(55) కుటుంబంతో కలిసి ఉంటున్నారు. శుక్రవారం నాడు క్వారీలో బండలను పగులగొట్టడానికి తూటాలతో పేలుళ్లు జరిపారు. ఈ దాటికి పెద్ద బండరాళ్లు కిష్టమ్మ ఉన్న రేకుల షెడ్డుపై పడ్డాయి. ఈసమయంలో వంటగదిలో వంట చేస్తున్న ఆమెపై బండరాళ్లు పడడంతో అక్కడికక్కడే మరణించింది. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలో పేలుళ్లు జరుపుతున్నారని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీ వద్ద మహిళ మృతి విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా రహదారి పనులు

ప్రజాశక్తి-రొద్దం

ఆర్.మరవపల్లి క్రాస్-దొడఘట్ట మధ్య జరుగుతున్న తారు రోడ్డు పనులు

మండలంలోని ఆర్.మరవపల్లి క్రాస్ నుంచి దొడఘట్ట సరిహద్దు వరకూ 12 కి.మీ మేర చేపట్టిన తారు రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రొద్దం నుంచి వెంకటాపురం వరకూ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. 'ఆత్మీయ పలకరింపు' కార్యక్రమంలో భాగంగా ఇటీవల మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పర్యటనలో చిన్నగువ్వలపల్లి, పెద్దగువ్వలపల్లి, గోనిమేకలపల్లి, రెడ్డిపల్లి, దొడ్డఘట్ట గ్రామాల ప్రజలు రహదారి దుస్థితిని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి యుద్ధప్రాతిపదికన ఈ రహదారిలో తారు రోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రి ఆదేశాల మేరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనం గా నిర్వహించారు. వివిధ రంగాల్లో చరిత్ర సృష్టించిన మహిళలను స్ఫూర్తిగా తీసుకొని ధైర్యంగా ముందుకెళ్లాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నాగ రాజు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు గుణవతి, ఎ.వెంకటేశులు, రవికుమార్, మునిమడుగు నరసింహులు, రొద్దం బాబు, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో దుస్తులు పంపిణీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కియా ఇండియా సంప్రదాయానికి భిన్నంగా ఉన్నతంగా వేడుకలు నిర్వహించిందని కియా ఇండియా పిఆర్ఓ బండారి తేజస్వి పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ అంకితభావం కలిగిన కియా ఇండియా మహిళా ఉద్యోగులు అనంతపురం నగరంలోని రెయిన్‌బో క్రీసెంట్ అనాథాశ్రమంలో రోజంతా గడపాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా అనాథాశ్రమంలో ఉంటున్న బాలికలతో సంబంధాలను పెంపొందించడం, ఆనందాన్ని పంచడం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనాథాశ్రమం బాలికలతో సరదా ఇంటరాక్టివ్ గేమ్‌లు, సంభాషణలు చేశారు. వారికి ఎలక్ట్రానిక్స్, దుస్తులు, శానిటరీ ఉత్పత్తులు, తదితర వస్తువులు పంపిణీ చేశారు. కియా ఇండియా 'కేర్ ఫర్ పీపుల్' ప్రధాన విలువను, మెరుగైన ప్రపంచాన్ని రూపొందించ డంలో వారి నిబద్ధతను తెలిపారు.

అనాథాశ్రమంలో పిల్లలతో కియా ఇండియా మహిళా ఉద్యోగులు

పేదల భూములు అన్యాక్రాంతంపై వినతి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండలంలో ఎంతో కాలం నుండి అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములను పేద రైతుల నుండి లాక్కొని పట్టాలు తమ పేరున తెచ్చుకున్న వైనంపై పలువురు నాయకులు నారాలోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. పేదలభూములు లాక్కొన్న వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని పెడపల్లి మాజీ సర్పంచి శ్రీ రామ్ నాయక్, టిడిపి పుట్టపర్తి మండల కన్వీనర్ విజయ్ కుమార్ లోకేష్‌కు వినతి పత్రం అందజేశారు. కొత్తచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శంఖారావం సభలో బుధవారం లోకేష్ కు వారు వినతి పత్రం అందజేశారు. పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి, గువ్వలగుట్టపల్లి గ్రామాల పరిధిలోని దాదాపు 80 ఎకరాలు రెవెన్యూ భూమి ఇటీవల అన్యాక్రాంతమైందని అన్నారు. గతంలో అనుభవంలో ఉన్న రైతులను కాదని ఇతరులకు పట్టాలు మంజూరు చేశారని ఆరోపించారు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తికి 30 ఎకరాలు కేటాయించి అర్హులైన పేద రైతులకు అన్యాయం చేశారని వాపోయారు. స్పందించిన లోకేష్ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పెడపల్లి లో అన్యాక్రాంతమైన భూములను అనుభవంలో ఉన్న రైతులకే అందిస్తామని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఈ సమస్యను రైతులతో కలసి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు మాజీ సర్పంచి శ్రీరామ్‌నాయక్, మండల కన్వీనర్ విజయ్ కుమార్ తెలిపారు.

వెంగళమ్మ చెరువులో ఘన స్వాగతం

పుట్టపర్తి క్రైమ్ : కొత్త చెరువులో శంఖారావం సభ ముగించుకోని కదిరికి వెళుతున్న నారా లోకేష్‌కు వెంగళమ్మ చెరువు లో గ్రామస్తులు టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం పుట్టపర్తి మీదుగా కదిరికి వెళుతున్న సందర్భంగా ఆ గ్రామంలో ఐదు నిమిషాలు ఆగి పార్టీ కార్యకర్తలను నాయకులను నారా లోకేష్ పలకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరామ్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, ఈడిగ నీళ్ల రమణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం : పల్లె

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్

శంఖారావం సభలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, టిడిపి పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు.కొత్తచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలతోపాటు ఏ వర్గమూ ఆనందంగా లేదని అన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీలపై వేలాది అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. చివరకు తనపై కూడా ఎస్సీ, ఎస్టీ కేసు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసుపెట్టారని చెప్పారు. ఒక్కసారి గెలిపిస్తేనే పన్నులమీద పన్నులు వేస్తూ ప్రజల జీవితాలను అతలాకుతలం చేశారని విమర్శించారు. మహిళలకు సంబంధించిన రూ. 2500 కోట్లు అభయహస్తం నిధులు మాయం చేశారని ఆరోపించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేనివాడు ప్రజలకేం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. జగన్‌పాలనలో రాష్ట్రం 50ఏళ్లు వెనక్కి పోయిందని ఇకనైనా ప్రజానీకం మేల్కోవాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అవినీతి అనకొండగా మారారని ఆరోపించారు. బ్యాంకులకు రూ. 1670 కోట్లు టోకరా వేసిన వ్యక్తి ఏవిధంగా ప్రజలకు సేవలందిస్తారని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక పుట్టపర్తిని టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చేస్తామని, పరిశ్రమలు తెచ్చి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - కదిరి టౌన్

పార్టీలోకి చేరిన వారితో 'కందికుంట'

వైసీపీ కి చెందిన పలువురు ఆ పార్టీని వీడి టీడీపీ లో చేరారు. ఈ మేరకు శుక్రవారం కదిరి పట్టణంలోని కందికుంట నివాసంలో జరిగిన కార్యక్రమంలో కదిరి రూరల్ మండలం పట్నం పంచాయితీ ఏటీగడ్డతండాకు చెందిన సుమారు 30 కుటుంబాలు వైసీపీనివీడి కదిరి తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరాయి. పార్టీలో చేరిన వారందరికీ కందికుంట టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మూడే తిరుపాల్ నాయక్, మూడే రంగనాయక్, వి మంగే నాయక్, డి రమణ నాయక్, ఎన్ నరసింహ నాయక్, బి గోవింద నాయక్, ఎం భీమ్లా నాయక్, బి రామచంద్రనాయక్, ఎం తిరుపాల్ నాయక్, డి సురేష్ నాయక్, ఎం చిన్న పీరే నాయక్, బి తావ్రే నాయక్, డి పెద్దలక్ష్మ నాయక్, డి నారాయణస్వామి నాయక్, తదితరులు టిడిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుప్పాల ప్రసాద్, మేడిశెట్టి లోకేష్, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రమణా నాయక్, సుధాకర్, వాసిరెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనోపాధి కల్పిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

పేద మధ్యతరగతి వర్గాలు, చేతివృత్తుల వారికి మెరుగైన జీవనోపాదులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అర్హులైన లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మనోజ్ కుమార్ మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం ఖాదీ, గ్రామీణ పరిశ్రమల సెక్టార్, గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ పరిశ్రమలను కాపాడేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గిరిజనులు, కొండ ప్రాంతాలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలతో సహా పేద, చేతివృత్తుల వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

ప్రతి ఒక్కరు ఖాదీ ధరించాలి : ఖాదీ పరిశ్రమను ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఖాదీ దుస్తులు ధరించాలని ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్ కుమార్ సూచించారు. స్థానిక రైల్వే కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఎగ్జిబిషన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు పది రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్ ను హిందూపురం పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు కోరారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

కదిరి :ఆయుష్ కమిషనర్, ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకుల ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణ సమీపంలోని కుటాగుళ్లలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని చారుపల్లె వైద్యాధికారి డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 85 మంది రోగులకు కీళ్ల నొప్పులు, బిపి, షుగర్, మూత్ర, జీర్ణ, తదితర సమస్యలకు చికిత్స చేసి ఉచితంగా ఔషధాలు అందజేశారు. శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో రమేష్‌రెడ్డి, అర్చకులు నాగభూషణరావు సహాయ సహకారాలు అందించారు.

జాతీయస్థాయి పోటీలకు రామాపురం విద్యార్థిని

ప్రజాశక్తి - బత్తలపల్లి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని మౌనిక

అంతర్ రాష్ట్రాల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు.శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ నెలలో22 నుండి 24 వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరిచిన తమ పాఠశాలకు చెందిన మౌనిక జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల10 నుంచి 14 వరకు బీహార్ రాజధాని పాట్నాలో జరిగే జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఆమె పాల్గొంటుందన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

'వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైసిపి నాయకులు అన్నారు. శుక్రవారం కదిరి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో ఇర్ఫాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పార్టీ సమన్వయకర్త మక్బూల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం వైసీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణాధ్యక్షులు జిలాన్‌బాషా, వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు పరికి సాదిక్‌బాషా, లింగాల లోకేశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు ప్రజలతో మాట్లాడుతున్న మక్బూల్

ప్రతిజ్ఞ చేయిస్తున్న కందికుంట వెంకటప్రసాద్

కందికుంట అభిమానుల్లో జోష్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

నారా లోకేష్ శంఖారావం యాత్రలో కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమం ప్రారంభం సందర్భంగా నారా లోకేష్ టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమయంలో లోకేష్ 'ప్రసాద్ అన్నా ప్రతిజ్ఞ చేయించు' అన్నారు. దీంతో ఒక్కసారిగా శంఖారావం సభా ప్రాంగణం కందికుంట అభిమానుల హర్షధ్వనులతో మారుమోగింది. కదిరి శంఖారావం సభ టిడిపి నాయకులు, కార్యకర్తల్లో జోష్‌ను నింపింది.

ప్రత్యేక సంచిక తీసుకురావడం అభినందనీయం

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరణ చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-హిందూపురం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తి దిన పత్రిక ప్రత్యేక సంచికను తీసుకు రావడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారిణి ప్రసన్నలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి, జిల్లా మహిళ సభ్యురాలు నాగమణి, ఎన్‌జిఒ నాయకులు నరసింహులు మాట్లాడుతు ప్రతి అక్షరం ప్రజల పక్షం అన్న నినాదంతో ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు బడుగు బలహీన నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేక కథనాల పేరుతో ప్రజాశక్తి వెలుగులోకి తీసుకువస్తోందన్నారు. ఈ కార్యక్రమంలోఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కృష్ణవేణి, మండల ఉపాధ్యక్షురాలు రంగమ్మ, మహిళ ఉపాధ్యాయులు శంకరమ్మ, శ్రీ లత, పద్మజ, లీలావతి, వాణి, జ్యోతి, వీణ, జ్యోతిర్మయి, రాజేశ్వరి, సౌజన్య, ఉపాధ్యాయులు జోనల్ కార్యదర్శి అంజనమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ రాందాస్ నాయక్, ప్రజాశక్తి విలేకరి షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

హిందూపురం ఎంపీ గాని పుట్టపర్తి ఎమ్మెల్యే టికెట్ గాని కాంగ్రెస్ పార్టీ తరపున తనకు కేటాయించాలని కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ బెల్లం నజీర్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఆయన ఇటీవల పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడలోనే పిసిసి కార్యాలయంలో అధ్యక్షురాలు షర్మిలను కలిసి తమ వివరాలను ఆమెకి అందజేశానని బెల్లం నజీర్ తెలిపారు. పార్టీకి తాను అందిస్తున్న సేవలను గుర్తించి తనకు టికెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, బాబావాలి, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, ఎంఇ. రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామం అతిథిగృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాల ఉద్యోగ ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర సచివాలయాల అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నో సౌకర్యాలు కల్పించారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారని త్వరలోనే వారి సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. స్థానిక సంస్థలలో 33 శాతం కన్నా అదనంగా రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు.. ఉద్యోగ ఉపాధ్యాయులు డీఏలు ఇతర బకాయిలు రాలేదని ఆందోళన చెందుతున్నారని ఈ సమస్యలు కూడా పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తెచ్చామని అన్నారు. శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. నియోజకవర్గంలో 193 చెరువులకు నీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి ప్రభుత్వం రూ. 864 కోట్లు మంజూరు చేసిందని పనులు జరుగుతున్నాయని అన్నారు. రూ.6వేల కోట్లతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ టిఎ, టి ఆర్ టి యు, సమగ్ర శిక్ష అభియాన్, కెబిబిఇ, లెక్చరర్ అసోసియేషన్ నాయకులు, రాష్ట్ర నాయకులు మెట్ట క్రిష్టయ్య, వైఎస్ఆర్‌టిఎ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి టివి. రమణారెడ్డి, హిందూపురం పార్లమెంట్ వైసిపి అభ్యర్థి శాంతమ్మ, పలువురు ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కళ్యాణోత్సవం

లేపాక్షి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక దుర్గాపాపానేశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు అభిషేకాలు, రుద్ర హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపి, ఆలయ కమిటీ చైర్మన్ రమానందం, అర్చకులు శీనస్వామి, సింహస్వామి, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినుల కోసం 'కలలకు రెక్కలు'

సోమందేపల్లి : టిడిపి-జనసేనపార్టీల ఎన్నికల ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన 'కలలకు రెక్కలు' పథకం అద్భుతమని తెలుగునాడు అంగన్వాడీ డ్వాక్రా కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని, మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. అందులో భాగంగానే 'కలలకు రెక్కలు' పథకాన్ని మేనిఫెస్టోలో చేర్చిందన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలు ఆర్థిక ఇబ్బందులతో విద్యను వదిలేయకూడదని ఉద్దేశంతో ప్రభుత్వమే వృత్తి విద్యకు అవసరమైన ఆర్థిక ఏర్పాట్లు చేస్తూ ఆ మహిళలకు అవసరమైన బ్యాంకు లోన్లు కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును సిఎం చేయాలని కోరారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న నారా లోకేష్

పుట్టపర్తి అర్బన్ : సత్యసాయి మహా సమాధిని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దర్శించుకున్నారు. శుక్రవారం లోకేష్ తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తదితరులు సాయి కుల్వంత్ హాల్ కు చేరుకున్నారు. అక్కడ సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, ట్రస్టు సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. బాబా మహా సమాధిని లోకేష్ దర్శించుకున్నారు. అనంతరం మందిరం బయట ఆయన మాట్లాడుతూ బాబా తన బోధనలతో ప్రపంచవ్యాప్తంగా కీర్తింపబడుతున్నారన్నారు. తాగునీరు, విద్య, వైద్య రంగాలకు ఎనలేని సేవలు అందించారన్నారు. ట్రస్టు సభ్యులు బాబా ఆశయాలకు అనుగుణంగా సేవ కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పిసి. గంగన్న, టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, మహమ్మద్ రఫీ, సాలక్క గారి శ్రీనివాసులు, ఊరు వాకిలి సురేష్, జనసేన జిల్లా కార్యదర్శి అబ్దుల్ పాల్గొన్నారు.

మహాసమాధి వద్ద నారాలోకేష్

ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

ఉల్లాసంగా ఉట్ల పరుష

చిలమత్తూరు : మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ తిమ్మారెడ్డిపల్లి గ్రామం పొలిమేరల్లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం ఉట్ల పరుష ఘనంగా జరిగింది. ఈ మేరకు గ్రామ పెద్దలు కుమారస్వామిరెడ్డి, గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉట్ల పరుష నిర్వహించారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు ఉదయం నుండే పెద్ద ఎత్తున ఆంజనేయ స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉట్టిమాను ఏర్పాటు చేయడంతో యువకులు ఉత్సాహంగా ఉట్టిమాను ఎక్కేందుకు వచ్చారు. రాత్రి హరికథను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో జయశంకర్ రెడ్డి, శ్రీనివాసమూర్తి, జనార్ధన్, విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎఫ్ బలగాల కవాతు

ప్రజాశక్తి బత్తలపల్లి

ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ కమాండర్ సిహెచ్ జోసఫ్, సిఐ రాజేష్‌కుమార్, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం సాయంత్రం బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో 60 మంది బిఎస్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సమయంలో నియమావళికి లోబడి ఉండాలని వారు స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సోమశేఖరమూర్తి, స్టేషన్ సిబ్బంది, బిఎస్‌ఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

లోకేష్‌ను సత్కరించిన సామకోటి ఆదినారాయణ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నారా లోకేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న సామకోటి ఆదినారాయణ

కొత్తచెరువు మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన శంఖారావం క్యాంప్ కార్యాలయంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను గజమాలతో సత్కరించారు. కొత్తచెరువు మండలం ధర్మవరం రోడ్డు లో ఏర్పాటు చేసిన శంఖారావం క్యాంప్ సెట్ దగ్గర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సామకోటి ఈశ్వరయ్య, బాలాజీ, శ్యామల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహా గర్జనను విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్: ఈనెల పదవ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సాయి ఆరామం ప్రక్కన వైసిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన గర్జన మహాసభను విజయవంతం చేయాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే వైసిపి గిరిజన మహాగర్జన కార్యక్రమంలో గిరిజన, ఎరుకుల కుటుంబ సభ్యులు, పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని 198 తండాలు, పట్టణాలు, గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులు ఎరుకుల కులస్తులు ఈ సభకు తప్పక హాజరు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు దుంగా వత్ రమేష్ నాయక్, పీకే కుల్లాయప్ప నాయక్, గిరిధర్ నాయక్, పాలే జయరాం నాయక్, సేవే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళాదినోత్సవం

కాకతీయ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపకురాలిని సన్మానిస్తున్న దృశ్యం

డాక్టర్ షర్మిళ బేగంను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని ఆయా పాఠశాలలు, కళాశాలల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాకతీయ విద్యానికేతన్లో పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలాజయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలడైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు. నాట్యాచార్యులు బాబూబాలాజీ, కమలాబాలాజీ దంపతుల కుమార్తె రామలాలిత్య నాట్యంలో భారతదేశంలోనే వివిధ రాష్ట్రాల్లో ప్రదర్శనలు చేసి గిన్నీస్‌బుక్ వరల్డ్ రికార్డులతోపాటు 12 జాతీయ, అంతర్జాతీయ అవార్డు సాధించింది. దీంతో రామలాలిత్యను నాయకులు డిష్ రాజు, అరవిందరెడ్డి, గొట్లూరు చంద్ర, గంధమనేని నారాయణస్వామి, నబీరసూల్,మార్కెట్రహీం తదితరులు సన్మానించారు. అలాగే సత్యకృప మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డోలాపెద్దిరెడ్డి పిన్సిపాల్ మల్లికార్జున, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలు సమానత వైపు ఉండాలి :మహిళలు సమిష్టిగా సమానత్వం వైపు ఉంటే మరింత పురోగతిని సాధించవచ్చునని స్పందన హాస్పిటల్ డాక్టర్ సోనియా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పలు విషయాలను వివరించారు. మహిళలకు అన్ని హక్కులు పూర్తి దశలో కల్పించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

హిందూపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో శుక్రవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర విలువైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ నాయకురాలు నాగమణి, ఎంఇఒలు ప్రసన్నలక్ష్మి, గంగప్ప, ఎన్జీవో అధ్యక్షులు నరసింహప్ప, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : చట్ట సభల్లో అతివలు ఎక్కువసంఖ్యలో అడుగు పెట్టి దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపాలని పాఠశాల చైర్మన్ రిజ్వాన్‌బాషా తెలిపారు. పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో గల విశ్వ భారతి స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు అందరూ కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ మహిళలు వారి హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూపురం : మహిళా సాధికారితే మానవ సాధికారత అన్న ఐక్య రాజ్య సమితి నినాదాన్ని అంతా అంతా గౌరవిస్తూ మహిళలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని డాక్టర్ షర్మిళ బేగం అన్నారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్, సత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా సేవా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ షర్మిళ బేగం, కల్లూరు మహమ్మద్ ఉమర్ ఫారూక్ ఖాన్, జాబిలి చాంద్ బాషా, విశ్రాంత ప్రధానో పాధ్యాయురాలు జీవరత్నమ్మ, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, చైతన్య గంగిరెడ్డిలు వివిధ విభాగాలలో రానిస్తున్న వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, హారూన్ రషీద్, మునావీర్, డాక్టర్ గంగరత్నమ్మ, డాక్టర్ గాయత్రి, న్యాయవాదులు కళావతి, సంతోషీ, ఆర్మీ జవాన్ శైలజ, మాడుగుల సులోచనా దేవి, ఉసామాఖాన్, ఫైరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.